ప్రజల ప్రాణాలతో ఆర్ఎఫ్‌సీఎల్ చెలగాటం

- ఉత్పత్తి ప్రారంభమై మూడేళ్లు అయినా జెడ్ఎల్‌డీ ప్లాంట్ ఊసే లేదు
- అమ్మోనియా వ్యర్థాలను డ్రైన్లు, గోదావరిలోకి వదులుతున్న యాజమాన్యం

7



ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్ లెట్ నుంచి 7ఎల్ఈపీ డ్రైన్‌కు వస్తున్న వాటర్(ఫైల్)



ఆర్టీసీ బస్ డిపోకు స్థల సేకరణ

- బస్టాండ్ సమీపంలోని స్థలమే అనుకూలం
- వచ్చే ఏడాది వరకు డిపో ఏర్పాటు చేయాలనే పట్టుదలతో ఎమ్మెల్యే
- ఇప్పటికే డిపో ఏర్పాటుకు హామీ ఇచ్చిన మంత్రి పొన్నం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వచ్చే ఏడాది పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఆర్టీసీ బస్ డిపో కోసం అధికారులు ఎమ్మెల్యే సూచనల మేరకు ప్రభుత్వ స్థల సేకరణ చేస్తున్నారు. దీనికి బస్టాండ్‌ను ఆనుకుని ఉన్న పంచాయతీరాజ్ శాఖ భవనాలు ఉన్న స్థలమే అనుకూలంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పెద్దపల్లిలో ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు చేయాలన్న ప్రజల డిమాండ్ నెరవేరడం లేదు. అడుగులు ముందుకు పడడం లేదు. పెద్దపల్లి జిల్లా కేంద్రం కావడం, పెద్దపల్లి రైల్వే స్టేషన్ జంక్షన్‌గా మారినా కూడా ఇక్కడ బస్‌డిపో ఏర్పాటు కావడం లేదు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేలుగా పనిచేసిన వాళ్ల ప్రయత్నాలు ఫలించ లేదు. జిల్లాలో గోదావరిఖని, మంథనిలో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. ఇటు కరీంనగర్‌లో రెండు బస్ డిపోలు ఉన్నాయి.

పెద్దపల్లి జిల్లా కేంద్రానికి ఆయా బస్ డిపోలు 40 కిలోమీటర్ల లోపలే ఉన్నప్పటికీ, నియోజక వర్గంలో రవాణా సౌకర్యం మెరుగుపడడం లేదు. నియోజకవర్గంలో పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ఎలిగేడు, జూలపల్లి మండలాలు ఉన్నాయి. సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోని గ్రామాలకు గోదావరిఖని, హుజూరాబాద్ డిపోల నుంచి బస్సులు నడుస్తున్నాయి. ఎలిగేడు, జూలపల్లి మండలాలకు గోదావరిఖని, కరీంనగర్-2 డిపో బస్సులు నడుస్తున్నాయి. అయినా కూడా గ్రామీణ ప్రాంతాలకు సరిపడా బస్సులను నడపడం లేదు. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలు జీపులు, ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తున్నది.

2023 నవంబరు చివరలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన చింతకుంట విజయరమణారావు పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయించి ప్రయాణికుల కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో రాష్ట్రమం తటా మహిళలు ఉచితంగా ప్రయాణించే విధంగా రవాణా సౌకర్యం కల్పించింది. పెద్దపల్లి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు డిమాండ్ మేరకు బస్సులు నడపక పోవడంతో మహిళలు నష్టపోతున్నారు.

ఈ ఏడాది జూలై 19న కాల్వశ్రీరాంపూర్ మండలంలో జరిగిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి వచ్చిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పెద్దపల్లి లో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. వచ్చే ఏడాది నాటికి పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపోను ఏర్పాటు చేసి తీరతామని హామీ ఇవ్వడంతో నియోజకవర్గ ప్రజల్లో ఆశలు చిగురించాయి.

దీంతో పెద్దపల్లి ఎమ్మెల్యే ఆర్టీసీ ఉన్నతాధికారులను సంప్రదించి బస్ డిపో ఏర్పాటుకు ఎంత స్థలం కావాలి, ఎలాంటి ఏర్పాట్లు చేయాలని అడిగి తెలుసుకున్నారు. ఆ మేరకు ఆయన విషయాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష దృష్టికి తీసుకువెళతుండడంతో స్థల సేకరణ విషయమై ఆయన రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి బస్టాండ్‌కు మూడు కిలోమీటర్ల లోపు మాత్రమే డిపో ఉండాలని ఆర్టీసీ అధికారులు సూచించడంతో స్థల సేకరణ కోసం అధికారులు కుస్తీ పడుతున్నారు.

మండల ప్రజాపరిషత్ కార్యాలయ సముదాయంలో..

మంథని రోడ్డులో గల రాఘవాపూర్ గ్రామంలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు కావాల్సిన ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ, అది మూడు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉండడంతో ఆర్టీసీ అధికారులు ఆ స్థలం పనికి రాదని తేల్చేశారు. ఆర్టీసీ డిపో ఏర్పాటుకు కనీసం ఐదెకరాల స్థలమైనా ఉండాలి. బస్టాండ్ సమీపంలో గల ప్రభుత్వ ఐటీఐ స్థలంలో 20 ఎకరాలకు పైగా భూమి ఉన్నప్పటికీ, అది కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండడంతో ఆ భూమిని సేకరించడం సాధ్యం కాదని అధికారులు తేల్చారు. అది గాకుండా బస్‌డిపోను ఆనుకుని ఉన్న మండల ప్రజాపరిషత్ కార్యాలయం, ఎమ్మార్సీ భవనం, స్వశక్తి సంఘం భవనం, ఎక్సైజ్ కార్యాలయ భవనం, పంచాయతీరాజ్ ఈఈ, డీఈఈ కార్యాలయం, డివిజనల్ పంచాయతీ కార్యాలయాలు ఉన్న స్థలం సేకరిస్తే బస్ డిపో ఏర్పాటుకు అనువుగా ఉంటుందని ఎమ్మెల్యే, అధికారులతో కలిసి ఒక అంచనాకు వచ్చారు.

ఈ కార్యాలయాలకు ప్రత్యామ్నాయంగా మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో రెండెకరాల్లోపు ప్రభుత్వ స్థలం ఉండగా, అక్కడ జిల్లా పరిషత్ కార్యాలయ కాంప్లెక్సు భవనం నిర్మిస్తే బాగుం టుందని, అందులోనే మీటింగ్ హాల్, మండల పరిషత్, ఎమ్మార్సీ స్వశక్తి భవనం, పంచాయతీరాజ్ కార్యాలయాలను ఏర్పాటు చేయ వచ్చనే ప్రతిపాదన తీసుకువచ్చారు. ఇదికాక మరొక అనువైన స్థలం పెద్దపల్లి పట్టణంలో లేకపోవడం గమనార్హం. ఆర్టీసీ డిపో ఏర్పాటుకు స్థల సేకరణ సవాల్‌గా మారడంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. తుదివరకు ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఎట్టి పరిస్థితుల్లో ఏడాది వరకు పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపోను ఏర్పాటు చేయాలనే పట్టుదలతో ఎమ్మెల్యే ఉన్నారు. ఏం జరగనున్నదో వేచిచూడాల్సిందే.



ఎంపీడీవో కార్యాలయ దుకాణ సముదాయం

అర్హులందరికీ రైతు రుణమాఫీ చేసి తీరుతాం

- ఎమ్మెల్యే విజయరమణారావు



ఓదెలలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఓదెల, సెప్టెంబరు 9: అర్హులందరికీ రైతు రుణమాఫీ చేసి తీరుతామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని కొలనూర్, ఓదెల గ్రామాలల్లో సోమవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పర్యటించారు. కొలనూర్ గ్రామంలోని పలు వీధుల్లో రోడ్డు విస్తరణకు, మురికి కాలువల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. గ్రామంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించి పరిశీలించారు. అలాగే నిర్మాణం అవుతున్న శివాలయాన్ని పరిశీలించారు. అనంతరం ఓదెలలో డబుల్ బెడ్ రూమ్ భవనాలను సందర్శించి గదులను తనిఖీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడారు. మరిన్ని నిధులను మంజూరు చేయించి డబుల్ ఇళ్ల సముదాయంలో విద్యుత్, నీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను మెరుగుపరిచి అర్హులైన వారికి ఇళ్లను పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పెద్దపల్లి, ఓదెల, సుల్తానాబాద్, కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు.

రుణమాఫీ కానీ రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని, అర్హత ఉన్న ప్రతి రైతుకు పూర్తిగా రుణమాఫీ అవుతుందని, అలా గే రైతు వేదికల్లో రైతులంతా డాటాను నమోదు చేసి అప్లోడ్ చేయించుకోవాలని సూచించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఆరు లక్షలకు పైగా రైతుల దరఖాస్తులపై స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుతం మండలంలో 1500 లకు పైగా రైతుల దరఖాస్తులను అప్లోడ్ చేయడం జరిగిందని, వీరందరికీ రుణమాఫీ వర్తిస్తుందన్నారు. మాది వాయిదాల ప్రభుత్వం కాదని ఏకకాలంలో రుణమాఫీ చేసి, మళ్లీ రుణాలు అందజేసిన ప్రభుత్వమని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ గోపు నారాయణరెడ్డి, చింతం కుమారస్వామి, కట్కూరి సమ్మిరెడ్డి, సామశంకర్, ఆకుల మహేందర్, బోడకుంట శంకర్, నాగపురి రవి, బోడకుంట స్వామి, తీర్థాల వీరయ్య, బైరి రవీందర్ గౌడ్, గుండేటి మధు, చీకట్ల ముండయ్య, గొర్ల శ్రీనివాస్, పెండెం లక్ష్మణ్, మీనుగు సంతోష్, గోపతి సదానందం, మాజీ సర్పంచ్ బొంగుని రాజయ్య గౌడ్, పిట్టల నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

జ్యోతినగర్, సెప్టెంబరు 9: ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌టీపీసీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ మాట్లాడారు. మాదకద్రవ్యాల వలన కల్గే దుష్పరిణామాలను వివరించారు. ప్రస్తుతం విద్యార్థి దశలోనే కొందరు గంజా యి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమైన విషయమని అన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, సమాజంలో చెడు వ్యక్తులుగా ముద్రపడుతుందని అన్నారు. విద్యార్థులు, యువత చెడు అలవాట్లుకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై శ్రీనివాస్ సూచించారు. ఎవరైన మాదక ద్రవ్యాలు వాడినట్లు, సరఫరా చేసినట్లు తెలిస్తే పోలీసులకు గాని ఎక్సైజ్ సిబ్బందికి గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్తిలో వాటా కోసం..
భర్త అంత్యక్రియలను అడ్డుకున్న భార్య

- పోలీసులు, పెద్దల జోక్యంతో అంత్యక్రియలు పూర్తి

7

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎంఈవో రాజయ్య

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 9: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు గోదావరిఖని జడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం మండల విద్యాధికారి రాజయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థులు మంచి నడవడికతో జీవితంలో ఎదగాలన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ కె శంకర్ మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ ఏవిధంగా వ్యాప్తిస్తుందో దాని నివారణ మార్గాలను తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సింగరేణి సంఘాలకు 'గుర్తింపు'

- గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ - ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీకి హోదా - సంఘాల నాయకులకు అందజేసిన సీఎండీ బలరాంనాయక్





గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం పత్రాలను అందుకుంటున్న ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘం నాయకులు

గోదావరిఖని, సెప్టెంబరు 9: సింగరేణిలోని కార్మిక సంఘాలకు గుర్తింపు, ప్రాతినిధ్య హోదాలు ఎట్టకేలకు దక్కాయి. గత సంవత్సరం డిసెంబరు 27న సింగరేణిలో సీక్రెట్ బ్యాలెట్ ద్వారా గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ విజయం సాధించినప్పటికీ అధికారికంగా ఈ రెండు సంఘాలకు గుర్తింపు, ప్రాతినిధ్య హోదా పత్రాలు అందలేదు. ఎన్నికలు నిర్వహించిన కార్మికశాఖ సింగరేణి ద్వారా హోదా పత్రాలు పొందాలని చెప్పడం, సింగరేణి తమకు సంబంధం లేదని దాటవేయడం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ అంశంపై సింగరేణి యాజమాన్యానికి ఎలాంటి సూచన లేకపోవడంతో హోదా పత్రాలు అందజేసే ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. చివరికి సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాంనాయక్ ఏఐటీయూసీకి గుర్తింపు హోదా పత్రాన్ని, ఐఎన్‌టీయూసీకి ప్రాతినిధ్య హోదా పత్రాన్ని అందజేశారు. ఐదు డివిజన్లలో మాత్రమే గెలిచినప్పటికీ ఏఐటీయూసీ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సంపాదించినందుకు గానూ ఏఐటీయూసీకి సింగరేణి సీఎండీ బలరాంనాయక్ గుర్తింపు పత్రాన్ని అందజేశారు. ఈపత్రాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అందుకున్నారు. ఆరు డివిజన్లలో విజయం సాధించి ప్రాతినిధ్య సంఘంగా గుర్తింపు పొందిన ఐఎన్‌టీయూసీకి హోదా పత్రాన్ని సీఎండీ అందజేశారు. ఈ పత్రాన్ని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, కేంద్ర ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, ధర్మపురి, సమ్మయ్య, జనరల్ సెక్రెటరీ త్యాగరాజన్ తదితరులు ఈ పత్రాన్ని స్వీకరించారు. దీంతో కార్మిక సమస్యలపై గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ, గెలిచిన డివిజన్లలో ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ సింగరేణి యాజమాన్యంతో వివిధ స్థాయిల్లో అధికారికంగా చర్చలు జరిపే అవకాశం ఏర్పడనున్నది. కార్యక్రమంలో డిప్యూటీ లేబర్ కమిషనర్, హైదరాబాద్ డి శ్రీనివాసులు పాల్గొన్నారు. కాగా ఈ సంఘాలకు రెండు సంవత్సరాలు మాత్రమే ఈ హోదా వర్తిస్తుందని ఆ ధ్రువీకరణల్లో పేర్కొన్నారు. నాలుగేళ్ల గుర్తింపు హోదా కోసం న్యాయస్థానాల్లో పోరాడేందుకు ఏఐటీయూసీ సంసిద్ధం కానున్నది. ఎన్నికలు జరిగిన ఎనిమిది నెలల తరువాత కార్మిక సంఘాలకు గుర్తింపు హోదా లభించింది.

హోటల్ వ్యర్థాలతో
కంపుకొడుతున్న అంబేద్కర్ కూడలి

జూలపల్లి, సెప్టెంబర్ 9. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా కూడలిలోని ఓ హోటల్ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ హోటల్‌లోని వ్యర్థాల నీటిని నేరుగా రోడ్డుపైకి వదిలివేయడంతో వాటితో వచ్చే దుర్వాసనతో భరించలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై హోటల్ నిర్వాహకులు వ్యర్థాలను వదిలివేయడంతో ఇబ్బందిగా మారిందని ప్రజలు మండిపడుతున్నారు. హోటల్ నిర్వాహకుల మూలంగా సమీప ఇళ్ల ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై అధికారులు వెంటనే స్పందించి హోటల్ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్
- జనగామలో ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే





జనగావు వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, వినాయక నిమజ్జన ఊరేగింపులో డోలు వాయిస్తున్న ఎమ్మెల్యే

కోల్‌సిటీ, సెప్టెంబరు 9: రామగుండం కార్పొరేషన్‌లో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం 9వ డివిజన్ జనగామ గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సదుపాయం, విద్యుత్ దీపాలు కల్పించాలని ప్రజలు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాల సీజన్ సందర్భంగా వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కార్పొరేషన్ తరఫున ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శుభ్రపరిచే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు ఏమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో సంప్రదించిచికిత్స చేయించుకోవాలని సూచించారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయిస్తానని ఆయన గ్రామ ప్రజలకు హామి ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ బొంతల రాజేష్, నాయకులు గాజుల రాయమల్లు, పెద్దెల్లి ప్రకాష్, తిప్పారపు శ్రీనివాస్, తాళ్లపల్లి యుగంధర్, కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

కళ్యాణ్‌నగర్: రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మనాలీ ఠాకూర్ దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి గోదావరినదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం ప్రజలను గణనాథుడు చల్లగా చూడాలని, రైతులకు పాడి పంటలను ఇవ్వాలని వేడుకున్నారు. క్యాంపు కార్యాలయం నుంచి గోదావరి వరకు ఒగ్గుడోలు, కోలాటం, మహిళలు నృత్యాలు ప్రదర్శిస్తూ గణనాథున్ని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, ఎండీ ముస్తాఫా, మాజీ మేయర్ జాలి రాజమణి, నాయకులు తిప్పారపు శ్రీనివాస్, దాసరి సాంబమూర్తి, ఉమాదేవి, గట్ల రమేష్, గడ్డం శ్రీనివాస్, ఆసిఫ్, దీటి బాలరాజు, పాతిపెల్లి ఎల్లయ్య, పెండ్యాల మహేష్, తాళ్లపల్లి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్, సెప్టెంబర్ 9: పట్టణంలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద మున్సిపల్ ఛైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కాపువాడ వినాయక మండపంతో పాటు గౌడ వీధి, బెస్తవాడ తదితర పలు మండపాలను వారు సందర్శించి ఆయా మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాపువాడ వినాయక మండప నిర్వాహకులు కాపు సంఘం నేతలు కందునూరి పోచాలు, ముత్యాలు తదితరులు, గాంధీనగర్ మండపం వద్ద కౌన్సిలర్ అనుమాల అరుణ బాబురావు దంపతులు, పద్మశాలి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మేరుగు యాదగిరి, సన్నీ తదితరులు, బెస్తవాడలో నిర్వాహకులు ఛైర్‌పర్సన్ దంపతులను ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు అంతటి అన్నయ్య గౌడ్ తదితరులు కూడా పలు చోట్ల ప్రత్యేక పూజలు చేశారు.

జూలపల్లి: మండలంలోని వడుకాపూర్‌లో గల యాదవ కమిటీ హాల్‌వద్ద గణేష్ నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని చత్రపతి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో సోమవారం భక్తులు ప్రత్యేకపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తమ కుటుంబాలతో పాటు గ్రామ ప్రజలందరిని సుభిక్షంగా ఉండేలా చూడాలని భగవంతుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో అబ్బోజు రాము, వేల్పుల కిరన్, వేల్పుల అజయ్, వేల్పుల సతీస్, వేల్పుల సది, వేల్పుల కొండయ్య, వేల్పుల లింగయ్య, మెండె రాజ్‌కుమార్, మెండె అనిల్, ఓంకార్, కొమ్మ రమేష్, పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయి నీటి నిల్వలు

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటి నిల్వలకు చేరువలో ఉన్నాయి. ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో నీటి పారుదల శాఖ అధికారులు పరిస్థితినిబట్టి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజక్టుల వరద గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్‌ఎండీ నుంచి కాకతీయ కాలువ ద్వారా ఆదివారం దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు సోమవారం నిలిపివేశారు.



నిండు కుండలా ఎల్‌ఎండీ

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం 42,157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 42,157 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అయిదు వరద గేట్ల ద్వారా 15,620 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,000 క్యూసెక్కులు, వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి 4,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 666 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

● పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 1,23,094 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో అధికారులు సోమవారం 20 గేట్లు ఎత్తి 1,07,650 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెట్టారు. శనివారం రాత్రి వరకు ప్రాజెకు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉండడంతో పైనుంచి వరద నీటిని అంచనా వేస్తూ శ్రీపాద ఎల్లంపల్లి గేట్లను ఎత్తి గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టుపూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 18.702 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

● బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి 15925 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి 13,400, మూలవాగు, మానేరు వాగు ద్వారా 2,525 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్‌ఎండీ ప్రాజెక్టుకు ఆరు గేట్ల ద్వారా 10,300, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 316.17 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 23.03టీఎంసీల నీరు ఉంది.

● తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా ఆదివారం దిగువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన ఇరిగేషన్ అధికారులు సోమవారం మధ్యాహ్నం నిలిపివేశారు. అన్ని చోట్ల విరివిగా వర్షలు కురుస్తుండడం, వాగులు, కుంటలు, చెరువులు పొంగి పోర్లుతుండడంతో నీటి విడుదలను నిలిపివేసినట్లు తెలిసింది. మిడ్ మానేరు నుంచి వచ్చే నీరు 10 వేల క్యూసెక్కులకు తగ్గింది ఎల్‌ఎండీ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా సోమవారం రాత్రి వరకు 22.824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 623 క్యూసెక్కులు, ఎంఎంఆర్ నుంచి 10,300, ఎగువ నుంచి 1,050 క్యూసెక్కులు మొత్తం 11,973 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఎల్‌ఎండీలోకి వస్తోంది. మిషన్ భగీరథ, నీటి ఆవిరి రూపంలో 305 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెళుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వినాయక మండపాల్లో చోరీ

తిమ్మాపూర్, సెప్టెంబరు 9: మండలంలోని మహాత్మానగర్ ఎల్‌ఎండీ కాలనీలోని రెండు వినాయక మండపాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. వేంకటేశ్వర ఆలయ కల్యాణ మండపం అవరణలోని హోమశాలలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హోమశాల తాళం పగలగొట్టి వినాయకుడికి భక్తులు వేసిన కరెన్సీ దండతోపాటు విగ్రహం వద్ద ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లారు. ఆలయంలోని లాకర్‌ను పగలగొట్టేందుకు యత్నించారు. హ్యాండిల్ విరిగిపోవడంతో వెళ్లిపోయారు. శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలోకి దొంగలు చొరబడి వినాయకుడికి తొడిగిన రాగి తొండంను ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై ఎల్‌ఎండీ పోలీసులకు సమాచారం అందించినట్లు మండపాల నిర్వాహకులు తెలిపారు.

'ఎస్సీ సంక్షేమ హాస్టళ్లను ప్రారంభించాలి'

గణేశ్‌నగర్, సెప్టెంబరు 9: ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను ప్రారంభించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ సంక్షేమ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రవణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఎల్కటూరి ఇషక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మూడు ఎస్సీ సంక్షేమ ప్రభుత్వ హాస్టల్స్ మంజూరయ్యాయన్నారు. వాటిని ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వాటిని వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు. ప్రభుత్వం మంజూరు చేసినా ఎందుకు ప్రారంభించకుండా కాలం గడుపుతున్నారని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు హాస్టళ్లలో సీట్లు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. సంక్షేమ హాస్టల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే విద్యార్థులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చారించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు గట్టు ఆకాష్, గన్నరపు రాకేష్, అంబాల సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

'నష్టపరిహారం ఇప్పించండి'

రామడుగు, సెప్టెంబరు 9: భారీ వర్షాలతో నష్టపోయిన తమకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని మత్స్యకారులు కోరారు. ఈ మేరకు రామడుగు మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటలక్ష్మికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని షానగర్ ఎల్లమ్మ చెరువు కట్టకు గండిపడిందన్నారు. చెరువులోని చేపలన్నీ కొట్టుకు పోయి పది లక్షల నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు జిట్టవేణి రాజు, ఉపాధ్యక్షులు రవి, నర్సయ్య, లక్ష్మీపతి, బసరవేని రాజయ్య పాల్గొన్నారు.

తిప్పన్నపేటలో ప్రబలిన జ్వరాలు



తిప్పన్నపేట లో పరీక్షలు చేస్తున్న మాతా శిశు సంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 9: జగిత్యాల మండలం తిప్పన్నపేటలో జ్వరాలు ప్రబలాయి. జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో జగిత్యాల జిల్లా మాత శిశుసంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలు ఇళ్లను పరిశీలించి జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు.

హైడ్రా వల్ల సామన్యులకు ఇబ్బందులు ఉండవు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: హైడ్రా వల్ల సామాన్యులకు ఎటువంటి ఇబ్బందులు కలగనీయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. హైడ్రాపై బీజేపీ నాయకులు నలుగురు నాలుగు రకాలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలు సక్రమంగానే జరుగుతుందన్నారు. ప్రతి పక్షాలకు ఏం మాట్లాడాలో తెలియడం లేదన్నారు. ఏదో ఒక స్టేట్‌మెంట్ ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. న్యాయ స్థానాలు ఇచ్చే తీర్పులను గౌరవిస్తామన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు విషయాన్ని శాసనసభ వ్యవహారాల మంత్రి, అధికారులు చూసుకుంటారని అన్నారు.

'చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి'

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 9: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో చాకలి వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు వనపర్తి శంకర్, పైడి కొమురయ్య, రాచకొండ నరేశ్, జిల్లా అధ్యక్షుడు పూసాల శ్రీకాంత్, ఉపాధ్యక్షులు నేరెళ్ల లక్ష్మన్, తడిగొప్పుల శ్రీపాల్, కార్యదర్శి మునిగంటి అశ్విన్ పాల్గొన్నారు.

కరీంనగర్‌లోనూ హైడ్రా లాంటి వ్యవస్థ ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: హైదరాబాద్ తరహాలో కరీంనగర్‌లోనూ హైడ్రా లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కమిటీ సభ్యుడు బెక్కంటి రమేశ్‌తో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో చెరువు శిఖం భూములను, నాళాలు, పార్కులను కబ్జాదారుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో చెరువులు, కుంటలు అదృశ్యం కావడానికి ప్రధాన కారకులు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాలిటి అధికారులేనని విమర్శించారు. అధికారుల అండదండలతో కొంతమంది రాజకీయ నాయకులు, కబ్జాదారులు కుమ్మక్కై పెద్దఎత్తున చెరువులు, కుంటలను మాయం చేస్తున్నారన్నారు.

ప్రజల ప్రాణాలతో ఆర్‌ఎఫ్‌సీఎల్ చెలగాటం

● అమ్మోనియా వ్యర్థాలను డ్రైనేజీలు, గోదావరిలోకి వదులుతున్న యాజమాన్యం ● ఏడాదిలో జెడ్‌ఎల్‌డీ పెడతామంటూ పీసీబీకి హామీ ● మూడేళ్లు గడుస్తున్నా ఊసే లేదు

కోల్‌సిటీ, సెప్టెంబరు 9: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ నుంచి చుక్క నీరు బయటకు పోదని, వ్యర్థాల ఊసే ఉండదని, ఉత్పత్తికి వినియోగించిన నీటిని శుద్ధి చేసి ప్లాట్ టౌన్ షిప్‌లో మొక్కల పెంపకానికి వినియోగిస్తామంటూ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ఊదరగొట్టింది. ఏడాదిలో జీరో లిక్విడ్ డిశ్చార్జి(జెడ్‌ఎల్‌డీ)నిర్మిస్తామని కాలుష్య నియంత్రణ మండలికి హామీపత్రం ఇచ్చింది. ఉత్పత్తి ప్రారంభమై మూడేళ్లు గడుస్తున్నా జెడ్‌ఎల్‌డీ ఊసే లేదు. జెడ్‌ఎల్‌డీ నిర్మించిన తరువాతే ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉండగా జెడ్‌ఎల్‌డీ నిర్మాణం లేకుండానే ప్రాజెక్టుకు కాలుష్య నియంత్రణ మండలి కాన్సెంట్ ఆఫ్ ఆపరేషన్ ఇచ్చేసింది. గత ఏడాది రూ.328కోట్ల నికర లాభాలను ఆర్జించిన సంస్థ జెడ్‌ఎల్‌డీకి రూ.170కోట్లు పెట్టేందుకు వెనుకాడుతోంది. జెడ్‌ఎల్‌డీ నిర్మాణానికి ఫిబ్రవరిలో టెండర్లు ఆహ్వానించి తరువాత వదిలేసింది. ప్లాంట్ నుంచి వెలువడే రసాయనిక వ్యర్థాలను నేరుగా గోదావరిలోకి వదులుతున్న సంస్థ తాజాగా లీకేజీ అయిన అమ్మోనియాను నేరుగా మున్సిపల్ డ్రైన్లలోకి వదిలింది. అమ్మోనియా ఘాటుకు వేల మంది జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం మాత్రం నోరు మెదపడం లేదు.

రామగుండం ఎరువుల కర్మాగారం నిర్మాణ సమయంలో ప్లాంట్‌లో జెడ్‌ఎల్‌డీ పెడతామని, తరువాతే ఉత్పత్తి ప్రారంభిస్తామని ప్రభుత్వానికి ప్రాజెక్టు నివేదిక ఇచ్చింది. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో జనం ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి వెలువడే వ్యర్థాలపై ఆందోళన వెలిబుచ్చారు. ప్లాంట్‌లో జెడ్‌ఎల్‌డీ పెడతామని, చుక్క నీరు కూడా బయటకు రాదని పేర్కొన్నది. సాధారణంగా చిన్నచిన్న పరిశ్రమల్లో సైతం ఉత్పత్తికి ముందే జెడ్‌ఎల్‌డీ నిర్మాణం జరుగుతుంది. కానీ ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో మాత్రం జెడ్‌ఎల్‌డీ నిర్మాణమే జరుపలేదు. ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 2021-22ఆర్థిక సంవత్సరంలో అమ్మోనియా లీకేజీ కావడంతో జనం ఆందోళనకు దిగారు. ఒక సందర్భంలో కాలుష్య నియంత్రణ మండలి ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపి వేయించింది. కేంద్రం జోక్యం చేసుకుంది. ఆ సమయంలో ఏడాదిలో జెడ్‌ఎల్‌డీ నిర్మిస్తామంటూ పీసీబీకి రాతపూర్వక హామీ ఇచ్చింది.


విఠల్‌నగర్ డ్రైనేజీలోఆర్ఎఫ్‌సీఎల్ నీరు


వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్న విఠల్‌నగర్ వాసులు (ఫైల్)

● జెడ్‌ఎల్‌డీ అంటే...

ఫెర్టిలైజర్స్ ఇండస్ట్రీస్‌లో నీటి కాలుష్యం జరుగుతుంది. ముఖ్యంగా అమ్మోనియా ఉత్పత్తి సమయంలో వ్యర్థాలు వెలువడతాయి. జెడ్‌ఎల్‌డీ(జీరో లిక్విడ్ డిశ్చార్జి)కి సంబంధించి మూడు స్టేజీల్లో ట్రీట్‌మెంట్ జరుగుతుంది. మొదట వ్యర్థ జలాల నుంచి వ్యర్థాలను తొలగించడం, తరువాత వ్యర్థాలను ఘన రూపంలోకి, ద్రవరూపంలోకి మార్చుతారు. నీటిని పూర్తిగా శుద్ధి చేసి తిరిగి పారిశ్రామిక అవసరాలకు వినియోగించడం లేదా ప్లాంట్లలో గ్రీనరీకి వాడడం చేస్తారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ కూడా వ్యర్థ జలాలను శుద్ధి చేసి చెట్ల పెంపకానికి వాడతామంటూ ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొన్నది.

● ప్రజలకు, పర్యావరణానికి ముప్పు

ఆర్‌ఎఫ్‌సీఎల్ వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా వదులుతుండడంతో జిల్లాలోని అమ్మోనియా, సోడియం, ఇతర న్యూట్రియన్స్, ప్రమాదకరమైన వ్యర్థాలు అందులో ఉంటున్నాయి. దీంతో గోదావరి జలాలు, సమీప కాలనీల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. రెండు రోజుల క్రితం ప్లాంట్‌లో నుంచి అమ్మోనియా వ్యర్థాలను నేరుగా మున్సిపల్ డ్రైన్‌లో కలుపడంతో రామగుండం నగరంలోని వేలాది మంది ఇబ్బంది పడ్డారు.

● టెండర్లు పిలిచినా ముందుకు సాగని పనులు

ఆర్‌ఎఫ్‌సీఎల్ సంస్థ 2022-23లో రూ.8.59కోట్లు, 2023-24లో రూ.4,941 కోట్ల టర్నోవర్‌తో 328 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. 170కోట్ల రూపాయల అంచనాలతో జెడ్‌ఎల్‌డీ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. 180రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. జూన్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తయి నిర్మాణం ప్రారంభించాల్సి ఉంది.

రూ.7,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, సెప్టెంబర్ 9: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,700 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 49క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,700, కనిష్ఠ ధర రూ.7,650 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

వృథాగా దామెర చెరువు నీరు


దామెర చెరువు తూము నుంచి పోతున్న నీరు

శంకరపట్నం, సెప్టెం బరు 9: శంకరపట్నం మండలం మొలంగూర్ దామెర చెరువు తూము తెరిచి ఉండడంతో చెరువులో నీరు దిగువ కు వృథాగా పోతోంది. చెరువు తూము తెరిచి ఉంచడంతో నీరు దిగు వకు వెళ్లిపోయి వేసవిలో అవసరాలకు నీరు లేకుండా పోతుందని ఆవేదన చెందారు. నీరు దిగువకు పోవడంతో కింద ఉన్న పొలాలు నీట మునిగి పంట నష్టం వాటిల్లుతుందన్నారు. సంబంధిత శాఖాధికారులు వెంటనే స్పందించి తూము ద్వారా నీరు పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆస్తిలో వాటా కోసం అంత్యక్రియలను అడ్డుకున్న భార్య

● పోలీసులు, పెద్దల జోక్యంతో కార్యక్రమాలు పూర్తి

మంథని, సెప్టెంబర్ 9: భర్త ఆస్తిలో తన కొడుకుకు వాటా కోసం భర్త అంత్యక్రియలను భార్య అడ్డుకున్న సంఘటన పెద్దపల్లి జిల్లా మంథని గోదావరినది తీరంలో సోమవారం జరిగింది. మంథని మండలంలోని విలోచవరం గ్రామానికి చెందిన సురేష్‌కు సంధ్యతో మూడు సంవత్సరాల క్రితం వివాహం కాగా వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య నెలకొన్న కుటుంబ కలహాల కారణంగా సంధ్య కొంత కాలంగా సురేష్‌కు దూరంగా ఉంటోంది. ఈక్రమంలో సురేష్(30) హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులు మంథని గోదావరి నది తీరానికి తీసుకువచ్చారు. విషయం తెలిసిన భార్య సంధ్య తన కొడుకుతో పాటు మంథని గోదావరినది తీరానికి చేరుకొని భర్త ఆస్తిలో తన కొడుకు వాటా తేల్చాకే అంత్యక్రియలు జరపాలని అడ్డుకున్నారు. భర్త తరుపున కుటుంబ సభ్యులు నచ్చజెప్పినప్పటికీ వినలేదు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు, ఇరువర్గాలకు చెందిన పెద్ద మనుషులు కర్మకాండలు ముగిశాక ఆస్తి గుర్పించి చర్చిద్దామని నచ్చజెప్పడటంతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

జ్వరంతో ఇద్దరి మృతి

వెల్గటూర్, సెప్టెంబరు 9: మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో జ్వరంతో బాధపడుతూ అవ్వ లింగమూర్తి (45) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగమూర్తి జ్వరంతో బాధ పడుతూ జగిత్యాల ఆసుపత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు.

● ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని హనుమాన్ వీధికి చెందిన గజ్జల రామ్ చరణ్(10) అనే 4వ తరగతి విద్యార్థి జ్వరంతో సోమవారం మృతి చెందాడు. రామ్‌చరణ్ వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్యం చేయిస్తున్నారు. అయినా కూడా జ్వర తీవ్రత తగ్గలేదు. వైద్యుల సూచన మేరకు రెండు రోజుల క్రితం కరీంనగర్ లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు.

పెద్దాపూర్ గురుకులంలో పూర్తిస్థాయి తరగతులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో నెల రోజుల తరువాత పూర్తి స్థాయిలో తరగతులు ప్రారంభించారు. సోమవారం ఆరు నుంచి ఇంటర్ వరకు తరగతులను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు. పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను నెల రోజుల క్రితం ఇంటికి తీసుకెళ్లారు. తరువాత విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్‌లో తరగతులను నిర్వహించారు. విద్యార్థులకు కావాల్సిన వసతులు కల్పించడానికి సెలవులు ప్రకటించారు. అసంపూర్తిగా ఉన్న నూతన భవనంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వారికి ప్రభుత్వం, సొసైటీ వారి సూచనలతో వసతులు కల్పించడమే కాకుండా కావల్సిన డబుల్ కాట్ బెడ్స్, మౌలిక వసుతులు ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పించిన అనంతరం తరగతులను పూర్తి స్థాయిలో ప్రారంభించారు. దీంతో పాఠశాలకు సోమవారం 225 మంది వచ్చారు. మరి కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి గురుకుల పాఠశాలను పరిశీలించి సోలార్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారని, మిగతా విద్యార్థులు ఈ నెల 15 నుంచి హాజరవుతారని ఉపాధ్యాయులు తెలిపారు.


పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో తరగతులకు హాజరైన విద్యార్థులు

108లో మహిళ ప్రసవం

● తల్లి, బిడ్డను క్షేమంగా ఆసుపత్రికి తరలించిన సిబ్బంది


108 వాహనంలో జన్మనిచ్చిన తల్లి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామానికి చెందిన కలవేన శారద పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. హుటాహుటిన 108 సిబ్బంది శారద ఇంటికి చేరుకుని వెంటనే పెద్దపల్లి మాతా శిశు ఆసుపత్రికి తరలించే క్రమంలో మహిళకు పురిటినొప్పులు అధికమయ్యాయి. వెంటనే 108 ఎమర్జెన్సీ టెక్నీషియన్ నిమ్మతి శ్రీనివాస్ పైలట్ హబీబ్ సహకారంతో కాల్ సెంటర్ ద్వారా వైద్యుల సలహా మేరకు 108 వాహనంలోనే ప్రసవం చేశారు. కలవేని శారద పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వగా తల్లి, బిడ్డను ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దళితబంధు రెండో విడత నిధులు మంజూరు చేయాలి

ఇల్లందకుంట, సెప్టెంబరు 9: రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు రెండో విడత నిధులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద సోమవారం దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా దళితబంధు నిధుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పేడచెవిన పెట్టడం సరికాదన్నారు. ఈ మేరకు కోతుల బొమ్మలను ప్రదర్శన చేస్తూ మోకాళ్లపై కూర్చొని వినూతన రీతిలో నిరసన తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం హుజూరాబాద్ నియోజకవర్గంలోని మిగిలిన దళితులకు రెండో విడత దళితబంధు నిధులు మంజూరు చేయాలని, లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేష్, రాజేష్, ఆకాష్, బిక్షపతి, రక్షిత్, రాకేష్, సరిత, అర్జున్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న దళితబంధు సాధన సమితి నాయకులు

పాఠశాలలో కంప్యూటర్ దొంగిలించిన వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, సెప్టెంబర్9: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ దొంగిలించిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో కంప్యూటర్ అపహరించారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మామిడిపల్లి గ్రామానికి చెందిన మానం దిలీప్‌ను విచారించగా నేరం ఒప్పుకోవడంతో కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థుల నిరసన


ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థులు

గొల్లపల్లి, సెప్టెంబరు 9: గొల్లపల్లి మండలం వెంగళాపూర్ గ్రామానికి సమీపంలో బాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మిస్తే తమ పంట పొలాలు దెబ్బ తినడమే కాకుండా అనారోగ్యం పాలవుతామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వెంగళాపూర్ గ్రామానికి చెందిన రైతులు, నాయకులు, యువకులు మండల కేంద్రానికి తరలివచ్చి రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు అంటూ తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో రాంరెడ్డికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ రైస్ మిల్లు ఏర్పాతో గ్రామంలో వాతావరణ కాలుష్యంతో పాటు పొగ, నల్లని బూడిద రావడంతో అనారోగ్యం పాలవుతామని అన్నారు. కార్యక్రమంలో ఇను గంటి గంగన్న, రేగుంట అంజయ్య, వనపర్తి పెద్దిరాజం, దాసరి నాగేశ్, డెక్క రాజనర్సు, కొండ్ర గంగారెడ్డి, వనపర్తి రాజేందర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థినికి గాయాలు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 9: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో సోమవారం విద్యుదాఘాతంతో విద్యార్థిని గాయపడింది. కేసీఆర్‌నగర్‌కు చెందిన కోలిపాక రాము-రూప దంపతుల కుతూరు లాస్య (7) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండోతరగతి చదువుతోంది. ఎప్పటిలాగే సోమవారం పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా విద్యుత్ మీటర్లకు అమర్చిన ప్యానల్ బోర్డుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన స్థానికురాలు లాస్యను కాపాడే ప్రయత్నం చేసింది. విద్యుత్ ప్రసారం కావడంతో వదిలేసింది. వెంటనే ఇంట్లో ఉన్న విద్యార్థిని తల్లి రూప కాపాడే ప్రయత్నం చేయగా ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. స్థానికులు కర్రసాయంతో ప్యానల్ బోర్డుకు ఉన్న లాస్య చేతిని తొలగించారు. స్పృహ కోల్పోయిన లాస్యను జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించగా ఐసీయూలో చికిత్స పొందుతోంది.

వేములవాడ నుంచి శృంగేరీకి ప్రత్యేక బృందం

సిరిసిల్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం విస్తరణ పనులలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం శృంగేరీ పీఠం జగద్గురు భారతీ తీర్థ, పీఠాధిపతి విదుశేఖర భారతి స్వామిని కలవడానికి వేములవాడ నుంచి ప్రత్యేక బృందం వెళ్లింది. ఆలయ విస్తరణ నమూనాలను బృందం సభ్యులు అందించారు. ఆగమ శాస్త్రాన్ని అనుసరించి విస్తరణ చేపట్టేందుకు అనుమతులు కోరారు. నమూనాలను పరిశీలించిన స్వాములు ఆలయ విస్తరణకు ముందుకెళ్లాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. త్వరలోనే రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని సందర్శించి సూచనలు చేస్తామని తెలిపారు. అనంతరం శృంగేరి పీఠంలోని శారదాంబ అమ్మవారిని ప్రభుత్వ విప్, అధికారుల బృందం సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించింది. శృంగేరి తరలివెళ్లిన వారిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎంవో ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, దేవాదాయ స్థపతి వల్లీనాయకం, శృంగేరి పీఠం తెలంగాణ బాధ్యులు రాధాకృష్ణ, రాజన్న ఆలయ ఈఈ రాజేష్, ఆలయ ప్రధాన అర్చకులు నమిలికొండ ఉమేష్‌శర్మ, చంద్రగిరి శరత్ శర్మ, డీఈ రఘునందన్, అసిస్టెంట్ స్థపతి గణేష్, ఇంజనీర్ అసిస్టెంట్ అంజయ్య ఉన్నారు.


ఆలయ అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న విధుశేఖర భారతిస్వామి

వానాకాలం తిప్పలే!

● ప్రతియేటా పాపయ్యపల్లెకు తప్పని ఇబ్బందులు

శంకరపట్నం, సెప్టెంబరు 9: ప్రతియేటా వర్షాకాలం ఆ గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు పడితే గ్రామానికి రాకపోకలు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏళ్లుగా కోరుతున్నా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో సోమవారం శంకరపట్నం గ్రామ పంచాయతీ పరిధిలోని పాపయ్యపల్లె గ్రామస్థలు వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నిరసన తెలిపారు. పాపయ్యపల్లె, కేశవపట్నం గ్రామాల మధ్య వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి వర్షాలతో వరద ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ వర్షాలు పడితే వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నీరు ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం అవసరాల కోసం కేశవపట్నం వెళ్తామన్నారు. ప్రతియేటా వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టి బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు.


లోలెవల్ బ్రిడ్జిపై నిరసన తెలుపుతున్న పాపయ్యపల్లె గ్రామస్థులు

మధ్యాహ్న భోజనం సరిగా లేదని విద్యార్థుల ఆందోళన

ధర్మపురి, సెప్టెంబరు 9: మండలంలోని ఆరెపల్లి జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించడం లేదని విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రతి రోజు మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండటం లేదని పిల్లలు ఆందోళన చేసి పాఠశాల నుంచి వెళ్లిపోయారు. వంటలో పురుగులు, వెంట్రుకలు ఉన్నా అలానే వండి వడ్డిస్తున్నారని విద్యార్థులు వాపోయారు. వంట మనుషులు తమకు వద్దంటూ విద్యార్థులు తెలిపారు. వారిద్దరూ పాఠశాలలో ఉంటే తాము పాఠశాలలోకి వచ్చేది లేదంటూ విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారు. సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆయన అవయవాలు సజీవం

● రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి
● అవయవదానానికి ముందుకు వచ్చిన కుటుంబీకులు


నాగరాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9: తనువు చాలించినా అవయవ దానంతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన మారెల్లి నాగరాజు (43) ఎంఎ, ఎంఎడ్ పూర్తి చేసి స్థానికంగా వ్యవసాయం చేస్తూ పాడి గేదెల పెంపకంతో కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఈ నెల 5న ఎల్లారెడ్డిపేట శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయలవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల పాటు నాగరాజు చికిత్స పొందాడు. ఆదివారం రాత్రి పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. కుటుంబ పెద్ద దూరమైనా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపాలని భావించిన కుటుంబ సభ్యులు అవయవదానం చేసేందుకు ముందుకొచ్చారు. జీవన్‌దాన్ సంస్థ ద్వారా కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయం సేకరించారు. అక్కడి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నాగరాజు పార్థివదేహం వద్ద గౌరవ వందనం చేశారు. అనంతరం అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు. నాగరాజు బీఆర్ఎస్ కార్యకర్తగా కొనసాగేవాడు. గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, యువకులు భారీ ప్రదర్శన నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, స్థానిక నాయకులు నాగరాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి పాడే మోశారు. మృతుడికి తల్లి అనసూయ, భార్య వసుధ, రెండేళ్ల వయసు ఉన్న కొడుకు శిశ్వ ఉన్నారు. తల్లి అనసూయ ఫిర్యాదు మేరకు రోడ్డు ప్రమాదానికి కారణమైన మండలంలోని కోరుట్లపేటలోని ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో నివాసం ఉంటున్న వ్యక్తి ఆలకుంట పాపయ్య తీవ్ర గాయాలపాలయ్యాడని పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పాపయ్య సైకిల్‌పై ఎల్లారెడ్డిపేట బస్టాండు ప్రాంతం నుంచి గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం వైపునకు వెళుతున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లి వెళుతున్న కారు అతివేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. సమాచారం అందుకున్న ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

అడవిలో చెట్ల నరికివేత

● 8 మందిపై కేసు నమోదు

వీర్నపల్లి, సెప్టెంబర్ 9: వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలోని కొచ్చ గుట్ట బోరు, అందుగు చెట్టు బయిలు, కొమటి కుంట్ల ప్రాంతాల్లోని అడవిలో కొన్ని రోజులుగా చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. పోడు భూములు సాగు చేసేందుకు సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో అటవీ చెట్లను కొందరు దుండగులు నరికేశారు. ఓ వైపు ప్రభుత్వం హరితహారంలో చెట్లు నాటాలని చెబుతుంటే కొందరు అక్రమార్కులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వారి సొంత లాభం కోసం అటవీ సంపదను ధ్వంసం చేస్తున్న ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గర్జనపల్లి సెక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో సిబ్బంది పోడు భూముల సాగుకు ఎకరానికి సుమారు లక్షకు పైగా ముడుపులు తీసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పోడుభూమి సాగుకు తము చెప్పిన ట్రాక్టర్‌నే వాడాలని చెప్పడం కొసమెరుపు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరారు.


అటవీభూమిలో నరికివేసిన చెట్లు

వన్‌పల్లిలో చెట్ల నరికివేత విషయంపై ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఆయూబ్ ఖాన్ ను ఫోన్ ద్వారా వివరణ కోరగా అటవీ చెట్లను నరికిన విషయం తమ దృష్టికి వచ్చిందని, చెట్లను నరికింది ఎవరనే విషయంలో విచారణ చేసి 8 మంది పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అటవీ సంపదను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



ట్రినిటి డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు





కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సుల్తానాబాద్, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్స్ గాజుల లక్ష్మి, పెంద్రి రమ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 9: తెలంగాణ భాష అస్తిత్వ పోరాటంలో అలుపెరుగని ఉద్యమాన్ని నిర్వహించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు పెద్దపల్లి జిల్లా కేంద్రం, ఆయా మండల కేంద్రాల్లోనూ సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కాళోజి చిత్రపటానికి పూలమాలవేసి ఆయన తెలంగాణ భాషకు చేసిన సేవలను కొనియాడారు. ట్రినిటీ బీఈడీ కళాశాలలో, ట్రినిటి డిగ్రీ కళాశాల జరిగిన వేడుకల్లో భాగంగా తెలంగాణ రచయితల వేదిక, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. దానిలో భాగంగా తెలంగాణ అస్తిత్వ పోరాటంలో కాళోజీ పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు జీగురు రవీందర్, ప్రధాన కార్యదర్శి జింకల వెంకటేశ్, కళాశాల ప్రిన్సిపాల్ సీతూరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు. గాయత్రి డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పెద్దపల్లి రూరల్: తెలంగాణ అస్తిత్వ చైతన్యంతో రచనలు చేస్తే తెలంగాణ జాతిని మేలుకొల్పిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు కృషి చిరస్మరణీయ మని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూకట్ల తిరుపతి అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకొని పెద్దపల్లి మండలంలోని మూలసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దబ్బెట రాములు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని కొలనూర్ పాఠశాలతో పాటు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొలనూర్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం నిట్టూరి ఏసుదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బషీరోద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ జయలక్ష్మి, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఆఫీసు ఉద్యోగులు పాల్గొని నివాళుర్పించారు. మండల పరిషత్ ఆఫీసులో ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తదితరులు కాళోజీ జయంతి కార్యక్రమం నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజీ కవిగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ గర్రెపల్లి శంకర్, డాక్టర్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాంమోహనాచారి, ఎంపీఓ గోవర్ధన్, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, హెచ్ఈవో సుధాకర్, వినీత్, ఏఎన్ఎం సరోజన పాల్గొన్నారు.

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఈ పీవీ రామన్, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్, ఆర్ఐ శంకర్‌రావు, సీనియర్ అకౌంటెంట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మంథని: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన తెలంగాణ కోసం ఆయన వీరోచిత పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, అధికారులు పాల్గొన్నారు.

ముత్తారం: మండలంలో కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ జంగపెల్లి రాజేశం, లింగమూర్తి, నాయకులు బన్సీలాల్, చంద్రమౌళి, శ్రీనివాస్, సంపత్, రాజు, మహిళ అధ్యాపకులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాళోజీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సంజీవయ్య కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో జీడీ కనకయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా నోడల్ అధికారి కల్పన ఆదేశానుసారం స్థానిక శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కాళోజీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నాగమల్ల రాజేందర్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాళోజీ జీవిత చరిత్ర-సాహిత్యం అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో శంకర్, అధ్యాపకులు వెంకటప్పయ్య, సుశీల, సంతోషినికుమారి, జుబేదా భాను, ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి, లలిత, కోమలత పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, ప్రభుత్వ కార్యాలయాల్లో వేరువేరుగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అధికారులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో తహసీల్దార్ జక్కని స్వర్ణ, ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డి, పలువురు కార్యాలయ అదికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





ఎలిగేడు, కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయాల్లో నివాళులర్పిస్తున్న అధికారులు

కాళోజీ కృషి మరువలేనది..



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు

పెద్దపల్లి కల్చరల్: ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చిన కాళోజీ కృషి మరువలేనిదని అదనపు కలెక్టర్లు శ్యాం ప్రసాద్ లాల్, అరుణశ్రీ పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాళోజీ నారాయణరావు చిత్రపటానికి శ్యాంప్రసాద్‌లాల్, జే అరుణశ్రీ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ... సామాజిక సమస్యలపై నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా స్పందించిన వ్యక్తిత్వం కాళోజీది అన్నారు. కార్యక్రమంలో యువజన క్రీడల శాఖ సభ్యులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

లెక్కలకే పరిమితమవుతున్న వన మహోత్సవం



మొక్కలు లేకున్నా నాటిన ముళ్ల కంచెలు

పాలకుర్తి, సెప్టెంబరు 9: పచ్చదనం పెంపొందించడం కోసం ప్రవేశపెట్టిన వనమహోత్సవం పథకం మండలంలో మొక్కుబడిగా అమలవుతోంది. ప్రతీ సంవత్సరం లక్ష్యంమేరకు హడావుడిగా మొక్కలు నాటుతున్న అధికారులు వాటి సంరక్షణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో స్వల్ప కాలంలోనే నాటిన మొక్కలన్నీ కనుమరుగ వుతున్నాయి. దీంతో లక్షల రూపాయలు నిధులు వృధా అవుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అసలే మొక్కలు లేనిచోట పెద్దపెద్ద ముళ్ల కంచెలు రక్షణగా నాటడం, మొక్కలు ఉన్న చోట కంచెలు నాటకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పుట్నూర్, రామారావుపల్లి గ్రామాల మధ్యలో రోడ్డుకిరుపైపులా మొక్కలు నాటి ముళ్ల కంచెలను ఏర్పాటు చేశారు. కానీ వాటి సంరక్షణను అధికారులు మరిచిపోవడంతో అవి కనుమరుగయ్యాయి. అధికారులు మొక్కల సంరక్షణచర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిండుకుండలా చెరువులు, కుంటలు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వచ్చి చేరుకోవడంతో అప్పన్నపేట, రాగినేడు, కనగర్తి, రాఘవపూర్, కొత్తపల్లి, మూలసాల, భోజన్నపేట, హన్మంతునిపేట, నిట్టూరు, నిమ్మనపల్లి గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. వర్షాలు ఇదే విధంగా కురిసినట్లయితే కుంటలకు, చెరువులకు గండ్లు పడి వేలాది ఎకరాల్లో వరిపంటలు మునిగిపోయే పరిస్థితి నెలకొంది. వెంటనే అధికారులు స్పందించి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రాగినేడు చెరువు నిండుకుండలా ఏర్పడటంతో మత్తడి పారుతోంది. దీంతో పలువురు మత్తడి ప్రాంతం వద్ద ఫొటోలు దిగుతున్నారు.



నిండుకుండలా రాగినేడు చెరువు



అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటాలి



సింగరేణి జట్టుతో డైరెక్టర్ ఎంవీకే శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 9: అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో సింగరేణి సత్తా చాటాలని సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) ఎంవీకే శ్రీనివాస్ సూచించారు. ఈనెల 15 నుండి 20 తేదీ వరకు కొలంబియా దేశంలో జరగనున్న అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీల్లో పాల్గొనే సింగరేణి జట్టు సభ్యులను సోమవారం డైరెక్టర్ అభినందించారు. 45 రోజుల పాటు రెస్క్యూ రికవరీ, ఫైర్ ఫైటింగ్, రోప్ రెస్క్యూ, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ స్కిల్స్ విభాగాల్లో జట్టు సభ్యులు కఠోర శిక్షణ పూర్తిచేసుకు న్నారు. పోటీల్లో వివిధ దేశాలకు చెందిన మైనింగ్ కంపెనీలు పాల్గొననున్నాయని, వాటికి ధీటుగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. ఈసందర్భంగా అంతర్జాతీయ జట్టుకు ఎంపికైన సభ్యులను రెస్క్యూ సూపరెండెంట్ మాధవరావు డైరెక్టర్‌కు పరిచయం చేశారు. ఈకార్యక్రమంలో రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్ట్రక్టర్లు భాస్కర్‌రెడ్డి, నరసింహమూర్తి, టీం కోచ్‌లు, బ్రిగేడియర్లు పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ స్థాయి పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీజీఎం

రామగిరి, సెప్టెంబరు 9: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధి సెంటినరీకాలనీలో ఆడ్రియాల ప్రాజెక్టు ఏరియాలోని వర్క్ పీపుల్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంటల్ స్థాయి పోటీలను డీజీఎం చంద్రశేఖర్ సోమవారం ప్రారంభించారు. స్థానిక రాణిరుద్రమదేవి క్రీడాప్రాంగణంలో నిర్వహించే షటిల్, టీటీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు నాగేశ్వర్‌రావు, సునీల్‌ప్రసాద్, నరసింహరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సింగరేణి బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 9: సింగరేణి సంస్థకు విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఓసీపీ-3 బేస్‌వర్క్‌షాప్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సంవత్సరాల తరబడి వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో సింగరేణిపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. సింగరేణి పురోగతి సాధించుటకు ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత విస్మరించి, రావాల్సిన బకాయిలను పెండింగ్‌లో పెట్టడం సంస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. బదిలీ వర్కర్, జనరల్ మజ్దూర్‌ల డిసిగ్నేషన్‌లను మార్పు చేసి గౌరవ ప్రదమైన డిసిగ్నేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ రెండు డిసిగ్నేషన్‌ల కార్మికులు ఏళ్ల తరబడి పరిశ్రమలో అసమానలతకు గురవుతున్న ట్టు సత్తయ్య తెలిపారు. సింగరేణిలో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ కృషి చేస్తుందని, జాతీయ స్థాయిలో జరిగిన ఒప్పందాల అమలు, రక్షణ మెరుగుపరిచే అంశాల్లో కార్మికులకు ప్రయోజనం చేకూరేలా కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. గేట్‌మీటింగ్‌లో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ వడ్డెపల్లి కుమారస్వామి, నాయకులు సారంగపాణి, వేణుగోపాల్‌రావు, మాదాసి రవీందర్, ప్రమోద్‌కాషల్, రౌతు రమేష్, శ్రీమన్నారాయణ, ధరావత్ తిరుపతి, స్వామి, సంతోష్, లింగంనాయక్ పాల్గొన్నారు.

రామగిరి: దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల ఆందోళనల్లో సింగరేణి కార్మికులు భాగస్వామ్యం కావాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పిలుపు నిచ్చారు. మంగళవారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం కార్పొరేట్ స్థాయిలో ఉండే విధంగా ఉద్యమించాలని కోరారు. సింగరేణి డిసిగ్నేషన్ మార్చడం లేదని తక్షణం అమలు తేవాలని డిమాండ్ చేశారు. వెంటనే వాస్తవ లాభాలను ప్రకటించి 40 శాతం కార్మికులకు వాటా చెల్లింపు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఓసీపీ-2కు చెందిన కార్మికులు బీఎంఎస్ చేరారు. వారికి యూనియన్ కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు సారంగపాణి, వేణుగోపాల్‌రావు, అరుకాల ప్రసాద్, రవీందర్, మామిడి స్వామి, మర్రి సంతోష్, రౌతు రమేశ్, సంతోష్ పాల్గొన్నారు.

ఓసీపీ-5 క్యాంటీన్‌లో భోజన సదుపాయం ప్రారంభం

గోదావరిఖని, సెప్టెంబరు 9: ఆర్జీ-1 ఓసీపీ-5లో మొట్టమెదటిసారిగా ఉద్యోగులకు భోజన సదుపాయాన్ని సోమవారం ఆర్జీ-1 జీఎం డీ లలిత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సీఎండీ బలరాం కార్మికుల సంక్షేమం, గనులలో కార్మికుల అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా గతంలో ఓసీపీ-5 ఉద్యోగుల కోసం ప్రస్తుతం ఉన్న పాత క్యాంటీన్‌ను ఆధునీకరించి సుమారు రూ.13లక్షల వ్యయంతో క్యాంటీన్‌ను ప్రారంభించమన్నారు. అదే విధంగా కార్మికుల, యునియన్ విజ్ఞప్తి మేరకు క్యాంటీన్‌లో మొట్టమొదటి సారిగా భోజన సదుపాయంను ప్రారంభించామని జీఎం తెలిపారు. భవిష్యత్‌లో కుడా కార్మికుల సంక్షేమం కోసం నిత్యం ఉద్యోగులకు అవసరమైన వసతులను, సదుపాయాలను కల్పించడంలో కంపెనీ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మడ్డి ఎల్లయ్య, పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, పీవో చంద్రశేఖర్, సీఎంఓఏఐ ఉపాధ్యక్షులు పోనుగోటి శ్రీనివాస్, ఎస్ఓఎం రమేష్ బాబు, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ గుర్రం ప్రభుదాస్, వైస్ ప్రెసిడెంట్ మదన మహేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్జీ-1లో కంపెనీ స్థాయి రక్షణ అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జీఎం సేఫ్టీ (కార్పొరేట్) చింతల శ్రీనివాస్

గోదావరిఖని, సెప్టెంబరు 9: సింగరేణి గనుల్లో భద్రత ను మెరుగుపరచడం కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై స్థానిక ఇల్లందు క్లబ్ సోమ వారం కంపెనీ స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జీఎం సేఫ్టీ (కార్పొరేట్) చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన గనుల్లో రక్షణ చర్యలు పటిష్టంగా అమలు చేయడానికి, ప్రమాదాలు జరుగకుండా బొగ్గు ఉత్పత్తి చేయడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఉపరితల, భూగర్భ గనుల్లో ప్రమాదాల నివారణకు ఏ విధమైన రక్షణ చర్యలు చేపట్టాలో, ప్రమాదాలు జరగకుండా చేపట్టవలసిన జాగ్రత్త చర్యలు తెలిపారు. జీరో హార్మ్ దిశగా కంపెనీ ముందుకు పోవాలని, ప్రమాదాలు లేని సింగరేణిగా తీర్చిదిద్దడానికి మన వంతు కర్తవ్యాన్ని నెరవేర్చాలని కోరారు. ప్రమాదాలు లేని సింగరేణిగా తీర్చిదిద్దాడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు భూగర్భ గనుల్లో, ఓసీపీల్లో చుట్టూ బౌండరీ పెన్సింగ్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఏరియాల వారీగా గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలు, ఇప్పటి వరకు గనుల వారీగా జరిగిన ప్రమాదాలకు గల కారణాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, రామగుండం రీజియన్ జీఎం (సేఫ్టీ) కేహెచ్ఎన్ గుప్తా, కొత్తగూడెం రీజి యన్ జీఎం (సేఫ్టీ) కేజీ తివారీ, ఏరియా ఇంజనీర్ దాసరి వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ఏరియా సేఫ్టీ అధికారి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు 'ఖేలో ఇండియా' క్రీడాకారులు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కోచ్ మధుకర్

సుల్తానాబాద్, సెప్టెంబరు 9: సుల్తానాబాద్‌లో ఖేలో ఇండియా సెంటర్‌లో శిక్షణ పొందుతున్న పలువురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఖోఖో సబ్ జూనియర్ క్రీడా పోటీలను కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించగా ఇందులో సుల్తానాబాద్ ఖేలోఇండియా సెంటర్‌కు చెందిన ఖో ఖో క్రీడాకారులు కూకట్ల అఖిల్ యాదవ్, కాంపల్లి మహాలక్ష్మి, శ్రీగిరి అభిరనందన్‌లు ఎంపికయ్యారని కోచ్, అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారులు గెల్లు మధుకర్ తెలిపారు. ఈసందర్భంగా మధుకర్ యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని రాష్ట్ర జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేందుకు సుల్తానాబాద్ కేంద్రంలో శిక్షణ పొందుతున్నారన్నారు. ముగ్గురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వీరు ఈ నెల 13 నుంచి 15 వరకు ఉమ్మడి నల్లొండ జిల్లాలోని భువనగిరి లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయికి ఎంపికయిన వారిని జిల్లా క్రీడల యువజన శాఖ అభివృద్ధి అధికారి సురేష్ తో పాటు పలువురు సీనియర్ క్రీడాకారులు వారిని అభినందించారు.

● **క్రీడాకారులకు అభినందనలు**

సుల్తానాబాద్ సెయింట్‌మేరీ స్కూల్‌కు చెందిన అఖిల్, మహాలక్ష్మిలు ఎంపిక కాగా వారిని స్కూల్‌లో సోమవారం కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ కాసు శౌరెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 9: జిల్లాలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ, పెద్దపల్లి నందు మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లకు 20వ తేదీ ఉదయం 11వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందు విడతలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆప్షన్స్ ఎంచుకొని నేరుగా ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అప్లికేషన్ ఫామ్ మరియు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో తేదీ 11 నుంచి 20 వరకు పని దినాల్లో ప్రభుత్వ ఐటీఐ పెద్దపల్లి నందు హాజరుకాగలరని పేర్కొన్నారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగపరుచుకోవాలని పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు.

వినాయక నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు



పెద్ద చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్, సెప్టెంబరు 9: వినాయక నిమజ్జనోత్సవం కోసం సుల్తానాబాద్ పెద్ద చెరువు వద్ద మున్సిపాలిటీ వారు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం స్థానిక పెద్ద చెరువు వద్ద మున్సిపల్ సిబ్బంది చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. చెరువు కట్ట వద్ద వెడల్పు పనులు సోమవారం ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు వినాయకులకు పూజలు పూర్తి చేసిన అనంతరం వాటిని నిమజ్జనం చేయడం జరుగుతుందని వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు విలేక రులకు తెలిపారు. చెరువు కట్ట పైకి వాహనాలతో రాకుండా కేవలం వినాయక విగ్రహాలను మాత్రమే అనుమతించి సురక్షితంగా నిమజ్జనోత్సం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరువు ప్రాంతంతో పాటు కట్ట కొంత భాగం వరకు విద్యుత్ దీపాలు అమర్చి వెలుతురు ఉండేలా చేస్తున్నామని చైర్‌పర్సన్ తెలిపారు.

అంగన్‌వాడీ పిల్లలకు వైద్య పరీక్షలు



గర్రెపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

సుల్తానాబాద్, సెప్టెంబరు 9: సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్య ఆరోగ్య సిబ్బంది పిల్లలకు ఎత్తు, బరువు పెరుగుదల నమోదు చేస్తూ, రక్తహీనత వంటి పలురకాల వైద్య పరీక్షలు చేశారు. పిల్లలకు పోషకాహారం అందించే విషయంపై వైద్యాధికారులు పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనుదీప్, సౌందర్య, వెంకటరెడ్డి, ఏఎన్ఎం జమున రాణి, స్వరూప రాణి టీచర్ స్వర్ణలత స్వప్న తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు మంత్రి శ్రీధర్‌బాబుకు ఆహ్వానం



మంత్రి శ్రీధర్‌బాబుకు ఛత్రపతి విగ్రహం అందిస్తున్న యూత్ సభ్యులు

పెద్దపల్లి కల్చరల్ సెప్టెంబరు 9: ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 54 ఫీట్ల మహా గణనాథుడి పూజా కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా మంత్రి శ్రీధర్‌బాబును యువసేన సభ్యులు ఆహ్వానించారు. సోమవారం మంత్రిని కలిసి మంత్రిని కలిసి మట్టి వినాయకుని ప్రతిమను అందించి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి యువసేన సభ్యులు శివంగారి సతీష్,"సురేష్ అభినయ్, సాల్వాయి తిరుమల్ రావు, రామగిరి అఖిల్, మానుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 9: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీని సోమవారం 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే అంబులెన్స్‌లో ప్రసవించింది. మండలంలోని పందిళ్ళ గ్రామానికి చెందిన బండి సౌజన్య(26) సోమవారం రాత్రి పురిటి నొప్పులు వస్తుండడంతో 108కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఈఎంటీ బాలు, పైలట్ మదన్ గర్భిణీని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా వెన్నంపల్లి గ్రామశివారులో మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ బాలు పైలట్ మదన్ సహకారంతో అంబులెన్స్‌లో ప్రసవం చేశారు. సౌజన్య ఆడ బిడ్డకు జన్మనివ్వగా, తల్లిబిడ్డలు క్షేమంగా ఉన్నారు. మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లి జిల్లా దవాఖానకు తరలించినట్టు ఈఎంటీ బాలు తెలిపారు.